క్లుప్తంగా

ప్రొటోకాల్ పాటించరా?

సర్పంచ్ మహేందర్‌రెడ్డి



ఎంపీఓకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్

మొయినాబాద్ రూరల్: కాసీంబౌలి గ్రామ ఉప సర్పంచ్ ప్రొటోకాల్ పాటించడం లేదని స్థానిక సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామంలో తాను లేని సమయంలో అండర్ డ్రైనేజీ మురుగు కాలువను గ్రామస్తులతో కలిసి ప్రారంభించడం సరైంది కాదని విమర్శించారు. ప్రొటోకాల్ పాటించని ఆయనపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న సమ్మె

కేశంపేట: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లలిత, సత్యమ్మ, వెంకటమ్మ, కళావతి, అక్కమ్మ, కళావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి ఇంద్రారెడ్డి

సర్పంచ్ స్వప్న అంజయ్యగౌడ్

మొయినాబాద్ రూరల్: మాజీ మంత్రి ఇంద్రారెడ్డి పేదల ఆశాజ్యోతి అని నక్కలపల్లి సర్పంచ్ స్వప్న అంజయ్యగౌడ్ కొనియాడారు. బుధవారం ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా నక్కలపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7 నుంచి తాలుకా స్థాయి క్రికెట్ టోర్నీ

షాద్‌నగర్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 7వ తేదీ నుంచి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు మతిన్, మున్నా తెలిపారు. టోర్నీలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంట్రీ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.30 వేలతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు జట్టు వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్యాయం



మాట్లాడుతున్న బేడబుడగ జంగాల సంఘం నాయకులు

షాద్‌నగర్ రూరల్: రాజ్యాధికారం సాధించినప్పుడే బేడబుడగ జంగాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని బేడబుడగ జంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తమకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ కుటుంబంలో నలుగురు పదవుల్లో ఉన్నారని, బేడబుడగ జంగాలకు ఒక్క పదవి కూడా లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం తాలుకా అధ్యక్షుడు వారణాసి యాదయ్య, ఉపాధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేద్దాం

కొందుర్గు: మంత్రి కేటీఆర్ గురువారం షాద్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు తరలిరావాలని, ఆయా మండలాల బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సయ్యద్ హఫీజ్ బుధవారం వేర్వేరు ప్రకటనలలో తెలియజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

మహనీయుడు పండుగ సాయన్న

షాద్‌నగర్ రూరల్: పేదల ఆకలిని తీర్చేందుకు కృషి చేసిన పండుగ సాయన్నను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు రాములు అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో తాలుకా ముదిరాజ్ సంఘం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ పండుగ సాయన్న మహనీయుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని నలుగురికి పంచాలని సూచించారు. చేవెళ్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నేడు (గురువారం) నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సేవలపై ‘సమ్మె’ట



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



తాళం వేసిన అంగన్‌వాడీ కేంద్రం

- కేంద్రాలకు తాళాలు వేసిన అంగన్‌వాడీలు
- మూతపడిన సెంటర్లు
- ఆగిపోయిన ‘అక్షయపాత్ర’
- పౌష్టికాహారానికి గర్భిణులు, చిన్నారులు దూరం

కొత్తూరు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెబాట పట్టారు. అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షల ఇవ్వాలని, గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్యల సాధన కోసం 25 రోజులుగా విధులను బహిష్కరించారు. కేంద్రాలకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్నారు. సమ్మెతో చిన్నారులు చదువు, పౌష్టికాహారానికి దూరమయ్యారు.

అంతేకాకుండా గర్భిణులు, బాలింతలకు అక్షయపాత్ర నుంచి వచ్చే భోజనం ఆగిపోయింది. అర్హులకు పప్పులు, నూనెలు, ఇతర సరుకులు నేరుగా కేంద్రాల నుంచే అందేవి. ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడడంతో సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అర్హులకు సకాలం సరుకులు అందడం లేదు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు వారి కుటుంబసభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి. అంగన్‌వాడీలతో పాటు హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి.

సాయిబాబ, సీఐటీయూ జిల్లా నాయకుడు నేరుగా పంపిణీ

నేరుగా పంపిణీ

అంగన్‌వాడీలు, హెల్పర్లు సమ్మెతో నియోజకవర్గంలోని కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో పప్పులు, నూనె, బియ్యంతో పాటు ఇతర సరుకులను సూపర్‌వైజర్లు నేరుగా అర్హులకు పంపిణీ చేస్తున్నారు.

నాగమణి, ఐసీడీఎస్, సీడీపీఓ, షాద్‌నగర్

షాద్‌నగర్ నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో 316 అంగన్‌వాడీ సెంటర్లు, 54 మినీ సెంటర్లు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 2,500 మంది చిన్నారులు, 1,250 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. మొత్తం సెంటర్లలో 215 మంది టీచర్లు, 237 మంది హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు.



ఆధార్ నమోదు వద్ద సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

- రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

కొత్తూరు: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అంతేకాకుండా మండలంలోని పది గ్రామ పంచాయతీలకు మంజూరైన క్రీడాసామగ్రిని సర్పంచులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మతాలకు అతీతంగా పండుగలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత, విద్యార్థులతో పాటు గ్రామస్తులు వ్యాయామం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని జోస్యం చెప్పారు. అనంతరం ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు బారులు తీరడంతో సమస్యను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ వీరేందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలుస్తోందని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు స్పోర్ట్స్ కిట్లను ఎంపీపీ కోట్ల ప్రశాంతి రెడ్డి, ఎంపీడీఓ అనురాధతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఆడపడుచులకు బతుకమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, కుమ్మరిగూడ గ్రామ సర్పంచ్ కేతన, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

నేడు జీపీ భవనం ప్రారంభం

కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పంచాయితీ భవనం

నందిగామ: చాకలిగుట్ట తాండ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని రంగాపూర్‌కు అనుబంధంగా ఉన్న చాకలిగుట్ట తాండను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. దీంతో ఆ గ్రామానికి పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో పాఠశాల భవనంలో కొంత కాలంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ రాజు నాయక్ చొరవ తీసుకొని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో రూ. 21 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని నేడు మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.

సమస్యలను పరిష్కరించండి

షాద్‌నగర్: తపాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం డివిజన్ కార్యనిర్వాహక కార్యదర్శి జమీల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం బుధవారం తపాల ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జమీల్ మాట్లాడుతూ 2016లో గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల వేతనాల పరిశీలన కోసం నియమించిన కమలేశ్ చంద్ర కమిటీ నివేదికను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నివేదికలో సూచించిన విధంగా సీనియర్ జీడీఎస్‌లకు అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. గ్రూప్ బీమా, గ్రాట్యూటీని ఐదు లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు అర్హులకే ఇవ్వాలి

షాద్‌నగర్ రూరల్: అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని పీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎంపికలో లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఐదేళ్ల క్రితం మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తి కాలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలను గద్దె దించాలని పిలుపునిచ్చారు.

ఆశ వర్కర్ల భిక్షాటన



బిక్షాటన చేస్తున్న ఆశ వర్కర్లు

- స్థిర వేతనం కోసం నిరవధిక సమ్మె
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ప్రభుత్వానికి పరోక్షంగా హెచ్చరిక

షాద్‌నగర్: తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ ఆశ వర్కర్లు బుధవారం షాద్‌నగర్ పట్టణంలో భిక్షాటన చూస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ డిమాండ్‌ల సాధన కోసం ఎంతో కాలంగా వివిధ రూపాల్లో నిరసలు, ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం తమకు ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్‌ను నెలకు రూ. 1,000 చొప్పున 16 నెలల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రసూతి సెలవులకు సంబంధించిన సర్క్యులర్ వెంటనే జారీ చేయాలని, టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కొత్తూరులో..



కేశంపేటలో..

సబ్సిడీ దూరం.. సాగు భారం

- శనగ సాగు భారమే
- నాలుగేళ్లుగా ఇదే దుస్థితి
- యాసంగి ఆశలపై నీళ్లు
- ఆందోళనలో రైతన్న



శనగ పంట

షాబాద్: రైతుకు పెట్టుబడి సాయమందిస్తున్నాం.. వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నాం అని పాలకులు గంభీరమైన ప్రకటలనతో ఊదరగొడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం దోబూచులాటలో.. అన్నదాత పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఈ సారి శనగ పంటకు సబ్సిడీ లేనట్టుగా కనిపిస్తోంది. పక్షం రోజుల్లో సీజన్ ప్రారంభం కానుండగా ఇప్పటివరకు ఎలాంటి కదలిక లేదు. యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రధాన పంట అయిన శనగ విత్తుపై నాలుగేళ్లుగా సబ్సిడీ ఎత్తేయడంతో సాగు భారంగా మారింది.

రైతుల్లో ఆందోళన

ప్రస్తుతం సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. నాలుగేళ్ల క్రితం శనగల ధర రూ.6,500గా నిర్ధారించి అందులో 35 శాతం సబ్సిడీ మినహాయిస్తే రైతులు క్వింటాలుకు రూ.4,225కు అందించారు. దీని ప్రకారం కిలోకు రూ.42,25పైసలు ధర చెల్లించారు. కానీ ఈ సారి పరిస్థితి భిన్నంగా ఉండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటివరకు సబ్సిడీపై ఎలాంటి ప్రకటన రాలేదంటే.. ఇక పంపిణీ లేదనే విషయం స్పష్టమవుతోంది. ఇతర పంటలతో పోలిస్తే ప్రస్తుత యాసంగి సీజన్‌కు శనగ పంటే అనుకూలమైనదిగా రైతులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి వంటి భిన్నమైన పరిస్థితి కారణంగా పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం సంభవించింది. ఈ కారణంగా పంటల్లో ఎదుగుదల లోపించడంతో తెగుళ్లు దాడి చేశాయి. ప్రస్తుతం ఈ పంటలను తొలగించి శనగ సాగుతో ఉపశమనం పొందాలనుకుంటున్నారు. ప్రధానంగా నల్ల రేగడి భూములు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను భారీ ఎత్తున సాగుచేస్తారు. విత్తనాలు వేసే సమయంలో నల్లరేగడిలో కొద్దిపాటి తేమ ఉంటే చాలు మొలకెత్తే అవకాశముంటుంది. ఆ తర్వాత చలికాలంలో వచ్చే పొగమంచుతో పంటకు మంచి దిగుబడి వస్తుంది. అందువల్లే రైతులు శనగ సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ సారి అంచనాకు మించి శనగ పంట సాగులోకి వచ్చే అవకాశ ఉందని అంటున్నారు. అయితే నాలుగేళ్లుగా సబ్సిడీ విత్తనాల పంపిణీని నిలిపివేయడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సమాచారం లేదు

శనగ విత్తు సబ్సిడీపై ఎలాంటి సమాచారం లేదు. యాసంగి సీజన్‌లో శనగ పంట కీలకమే. జిల్లాలో నల్లరేగడి భూముల్లో శనగ ఎక్కువగా సాగు చేస్తారు. రైతుల అవసరాల మేరకు సబ్సిడీతో ప్రమేయం లేకుండా తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.

గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

తెలంగాణలో బీజేపీదే అధికారం



వాటర్‌ప్లాంట్ నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. నమో శుద్ధ జలం పేరుతో బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గోవులబండ తండా, నంద్యా తండా, లోక్యా తండాలలో వాటర్ ప్లాంటు నిర్మాణం పనులను విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. నందిగామలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ అధ్యక్షతన బుధవారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కులగూడ గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజకు సన్మానం

షాద్‌నగర్ రూరల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ విభాగంలో షాద్‌నగర్‌కు చెందిన శ్రీజ ఆల్ ఇండియా నాలుగో ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా బుధవారం వీర్లపల్లి శంకర్, శ్రీజను సన్మానించారు. ప్రాథమిక విద్య నుంచి అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ విద్యలో రాణించడం అభినందనీయమన్నారు.

పొటాష్‌తో పంటలకు మేలు

- ప్రయోజనం అధికం
- చీడపీడలు దూరం
- షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం



షాబాద్: పొటాష్ అన్నిరకాల పంటలకు మేలు చేస్తోంది. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే చీడపీడల బెడద తగ్గుతుంది. నత్రజని, భాస్వరంతో పాటు పొటాష్ వినియోగం వలన నాణ్యమైన పంట చేతికి వస్తుందని వ్యవసాయశాఖ ఏఓ వెంకటేశం తెలిపారు. మొక్కను గ్రహించిన నత్రజని, భాస్వరంను పొటాష్ వలన పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రయోజనాలు ఇలా...

పొటాష్‌తో మొక్కలకు పొడువైన, బలమైన, ఆరోగ్యవంతమైన గుబురు వేర్లు పుడతాయి. భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి వేళ్ల తేమను, పోషకాలను బాగా గ్రహిస్తాయి. గాలులకు వాలిపోవు. వరి కంకుల్లో గింజలు నిండుగా ఏర్పడటానికి తోడ్పడుతుంది. పోషక పదార్థాలను మొక్కలోని అన్ని భాగాలకు చేరవేయడంలో సహాయ పడుతుంది.

లోప లక్షణాలు

మొక్క ప్రారంభ దశలో పొటాష్ లోప లక్షణాలు కనిపించవు, అభివృద్ధి చెందని నల్లని వేర్లు పొటాష్ లోపానికి గుర్తు. ఆకులు ముదురు ఆకుపచ్చగా ఉండి వాటి మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి మొక్క అంతటా వ్యాప్తి చెందుతాయి. ముదిరిన ఆకులు ఎండి రాలిపోతాయి. మొక్కలు సరిగ్గా ఎదగవు, బలహీనంగా పొట్టిగా ఉంటాయి. పొటాష్ లోపం వలన వేర్లు ఒరిగిపోతాయి. అగ్గి తెగులు, ఆకు మచ్చు తెగులు, సుడి తెగులు ఉధృతంగా పంటపై ప్రభావం చూపుతాయి.

నివారణ చర్యలు

భూసార పరీక్షల ఆధారంగా పొటాష్ ఎరువును వినియోగించాలి. సాధారణంగా వరికి ఎకరాకు 18 కిలో పొటాష్ వేస్తే సరిపోతుంది. సిఫార్సు చేసిన మోతాదును రెండు సమ భాగాలుగా చేసి చివరి దమ్ములో, సిరపొట్ట దశలో వేయాలి. పొటాష్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయడం వలన అధిక ప్రయోజనం ఉంటుంది. జింకు లోపం ఉన్న భూముల్లో పొటాష్ మొత్తం యూరియాతో పాటు దమ్ములోనే వేయాలి. వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల్లో పొటాష్ బాగా పనిచేస్తుంది.



తెగులు సోకిన వరి పంట